క్లుప్తంగా

నిత్యావసరాలు పంపిణీ



తెనాలిఅర్బన్: అగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్షయవాధి గ్రస్తులకు సోమవారం గాంధీచౌక్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్ దంపతుల చేతుల మీదుగా నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఎస్ఆర్ కళాశాలలో నాక్ బృందం పర్యటన



తెనాలిఅర్బన్: వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో ఈనెల 6,7 తేదీలలో నాక్ బృందం పర్యటించిందని కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్రిసభ్య నాక్ బృందం కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిందని చెప్పారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి బృందం పర్యటిస్తుందన్నారు. కళాశాలకు నాక్ మెరుగైన గ్రేడింగ్ ఇస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ కళాశాల వ్యవస్థాపకులు నన్నపనేని వెంకట్రావు ఆశయాలకు అనుగుణంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యాబోధన చేయటం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అజయ్, విశ్రాంత ప్రిన్సిపాల్ సుగుణ, కామాక్షి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో సమయపాలన పాటించండి



తెనాలిఅర్బన్: పట్టణంలో ఉత్పత్తి అయిన చెత్తను సమయానికి సేకరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి ఆదేశించారు. 3,5,6,37 వార్డులలో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించారు. రోడ్లపై వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన వాటిని ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. త్వరగా తొలగించాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన గొర్నేని సూర్యనారాయణ నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు వృద్ధులకు అన్నదానం చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా గాంధీ సేవా శాంతి ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో సూర్యనారాయణ కుమారులు వెంకటేశ్వరరావు, ప్రదీప్‌కుమార్లు పర్యవేక్షించారు.

ప్రశ్నించలేని కూటమి ప్రభుత్వం

మంగళగిరి: అవినీతిని ప్రశ్నించలేని కూటమి ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ డిమాండ్ చేసింది. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లపై పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, నందం బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

మోతడక(తాడికొండ): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోతడక బస్టాప్ సమీపంలో మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు ఎస్ఐ జోజి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన బండ్లమూడి రమేష్ అనే వ్యక్తిని పట్టుకొని, అతని నుంచి 5 క్వార్టర్ల మద్యం, రూ.900 నగదు స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన సమస్యలను విద్యాశాఖ, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చొరవ చూపించి పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు కోరారు. సోమవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరం వద్దకు వెళ్లి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ

- ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబోధన
- వైకల్యాలను అధిగమించి ఉన్నత చదువులకు వెళ్లిన పలువురు విద్యార్థులు
- గతేడాది జిల్లాలో ప్రథమస్థానంలో నిలచిన తెనాలి భవిత కేంద్రం



తెనాలి భవిత కేంద్రంలో చిన్నారులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులు సునీత, రజనీ కుమారి

తెనాలిఅర్బన్: ప్రత్యేక అవసరాల చిన్నారులకు భవిత కేంద్రం భరోసా ఇస్తోంది. కేంద్రానికి వచ్చిన చిన్నారులకు ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్, సెల్ఫ్‌హెల్ప్ స్కిల్స్‌ను నేర్పుతూ వారిలో మనోధైర్యాన్ని నింపుతున్నారు. అలాగే అవసరమైన పిల్లలకు ఫిజియోథెరపీ ద్వారా వారి ఎదుగుదలకు తోడ్పాటును అందిస్తూ అందరి మన్ననలను పొందుతుంది. తెనాలి బాలాజీరావుపేటలో ప్రభుత్వం 2013లో భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దానిలో చెవిటి, మూగ, దృష్టిలోపం, మానసిక లోపాలతో జన్మించిన చిన్నారులకు విద్యను అందిస్తున్నారు. కొందరిలో శారీరక, మానసిక ఎదుగుదల లేకపోవటం, పొట్టిగా జన్మించటం, నడవలేని స్థితి ఉండటం, మందబుద్ధి కలిగి ఉండటం, ప్రతిరోజు కాలకృత్యాలు కూడా అక్కడే తీర్చుకోవడం, కుదురుగా ఒకచోట కూర్చోకపోవటం, నిత్యం నడుస్తుండటం వంటి లోపాలున్న వారికి ఇక్కడ విద్యను అందిస్తున్నారు. అలాగే వారిలో మానసిక ఎదుగుదలకు అవసరమైన శిక్షణను ఇస్తున్నారు. అవయవాలలో ఏర్పాడిన లోపాలను ఫిజియోథెరపీ ద్వారా అధిగమించే దిశగా కృషి చేస్తున్నారు. 0 నుంచి 18 సంవత్సరాల వయస్సున్న వారిని ఇక్కడ చేర్చుకుంటారు. ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు స్కూల్ జరుగుతుంది. ప్రస్తుతం 35 మంది చిన్నారులు ఇక్కడ చదువుకుంటున్నారు. తెనాలి మండల విద్యాధికారి-2 జయంతి బాబు పర్యవేక్షణలో డి.సునీత, వై.రజనీ కుమారిలు విద్యను అందిస్తున్నారు. డాక్టర్ శివనాగమల్లేశ్వరరావు చిన్నారులకు ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. చిన్నారులకు అవసరమైన సేవలు అందించేందుకు ఆయాగా జయమ్మ పనిచేస్తున్నారు.

ఉన్నత చదువులకు వెళ్లిన 10 మంది..

వివిధ లోపాలతో భవిత కేంద్రానికి వచ్చి విద్యను నేర్చుకున్న సుమారు పదిమంది విద్యార్థులు హైస్కూల్ విద్యకు వెళ్లారు. ఇటీవల ముగ్గురు విద్యార్థులు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి రాసి ఉత్తీర్ణత సాధించారు. వీరు ఇక్కడికి వచ్చి విద్యను నేర్చుకున్నందుకు ప్రభుత్వం రవాణా ఖర్చుల కింద ఒక్కొక్కరికి నెలకు రూ.300 చొప్పున పదినెలలకు రూ.3వేలు చెల్లిస్తుంది.

జిల్లాలో ప్రథమ స్థానంలో..

జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున భవిత కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెనాలిలోని భవిత కేంద్రాన్ని గతేడాది విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. అక్కడ చిన్నారులకు అందిస్తున్న సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలో తెనాలిని ఉత్తమ భవిత కేంద్రంగా ప్రకటించారు.

పాడైన ఆట వస్తువులు..

భవిత కేంద్రంలో విద్యార్థులు ఆడుకునేందుకు అవసరమైన ఆట వస్తువులను మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పక్కనే ఉన్న ఆట స్థలంలో ఏర్పాటు చేయించారు. అవి ఈఏడాది ప్రారంభంలో మరమ్మతులకు గురవడంతో వాటిని బాగు చేయించారు. కొద్దినెలలకే మళ్లీ అవి పాడైపోయాయి. ఇలా జరిగి సుమారు ఆరు నెలలు దాటుతున్నా.. నేటికీ వాటిని బాగు చేయించే వారు కరువయ్యారు. ఆట వస్తువులను బయట విద్యార్థులు ఎక్కువగా ఉపయోగించటం వల్ల ఇవి పాడవుతున్నట్లు తెలుస్తోంది. అలా జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అలాగే భవిత కేంద్రం, ఆటస్థలం వేరు వేరుగా ఉండటం వల్ల వాటి పర్యవేక్షణ కష్టసాధ్యమౌతుంది. కేంద్రాన్ని ఆటస్థలంతో అనుసంధానిస్తే చాలా వరకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.



ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ శివనాగమల్లేశ్వరరావు



తెనాలిలోని భవిత కేంద్రం

తన పని తాను చేసుకుంటున్నాడు..



నా కుమారుడు బ్రెయిన్‌లో లోపంతో జన్మించాడు. అతడు కుదురుగా ఉండడు. ఎక్కువ సమయం కూర్చోలేడు. బ్రెయిన్ తక్కువగా పని చేయడం వల్ల ఇలా జరుగుతుందని నిర్ధారణ అయ్యింది. రెండు సంవత్సరాల నుంచి భవిత కేంద్రానికి తీసుకు వస్తున్నాను. ఇక్కడ బ్రెయిన్ ఎదుగుదలకు ఇచ్చే శిక్షణ వల్ల ఇప్పుడు పరిస్థితి కొంత మెరుగుపడింది. ప్రస్తుతం తన పని తానుచేసుకోవటంతో పాటు కుదురుగా ఉండగలుగుతున్నాడు.

–ఎ.భుజాక్షి, తెనాలి

మా కుమారుడిలో ఎదుగుదల బాగుంది..



నా కుమారుడు క్రోమోజోముల లోపంతో జన్మించాడు. దీని వల్ల అతడు మానసిక పరిస్థితి బాగుండేది కాదు. అతడిని చూసి రోజూ బాధపడే వారం. అలాంటి సమయంలో భవిత కేంద్రం గురించి తెలిసి ఏడాది నుంచి ఇక్కడికి పంపుతున్నాం. ప్రస్తుతం నా కుమారుడి ఎదుగుదలలో చాలా మార్పు వచ్చింది. కేంద్రంలో ప్రస్తుతం తాను లీడర్‌గా ఉన్నాడు.

–శ్రీనివాసరావు, గంగానమ్మపేట, తెనాలి

లోపాలతో జన్మించిన వారిని కేంద్రంలో చేర్చండి

తెనాలి భవిత కేంద్రంలో వివిధ లోపాలతో జన్మించిన వారికి విద్యను అందించటంతో పాటు వారిలోని లోపాలను రూపుమాపేందుకు శిక్షణ ఇస్తున్నాం. 18 సంవత్సరాలలోపు చిన్నారులకు ఎడ్యుకేషన్, కమ్యునికేషన్, సెల్ఫ్ హెల్ప్ స్కిల్స్‌ను డెవలప్ చేస్తున్నాం. ఇలాంటి చిన్నారులు ఎవరైనా ఉంటే భవిత కేంద్రంలో చేర్చండి.

–డి.సునీత, ఉపాధ్యాయురాలు, భవిత కేంద్రం, తెనాలి

12న మాజీ సైనికుల సంక్షేమ సంఘం సమావేశం

తెనాలి: ది తెనాలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఈనెల 12న స్థానిక కొత్తపేటలోని ఎన్జీఓ కల్యాణ మండపంలో జరుగుతుందని అసోసియేషన్ నాయకులు వెల్లడించారు. సోమవారం విలేకరుల సమావేశంలో సంఘ అధ్యక్షుడు జి.బాబూరావు, కార్యదర్శి వేజండ్ల మురళీకృష్ణ, కోశాధికారి వీరబ్రహ్మం వివరాలను తెలియజేశారు. సర్వసభ్య సమావేశంలో ఏపీ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి ఆర్.గుణశీల, జిల్లా మాజీ సైనిక అధికారి వీఆర్‌కే చారి పాల్గొంటారని వివరించారు. తెనాలి డివిజనులోని మాజీ సైనికులందరూ హాజరుకావాలని విజ్ఞప్తిచేశారు.

జీఆర్పీ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు



తెనాలిరూరల్: గుంటూరు ప్రభుత్వ రైల్వే డీఎస్పీ పి.అక్కేశ్వరరావు సోమవారం తెనాలి జీఆర్పీ స్టేషన్‌ను సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా తెనాలి వచ్చిన డీఎస్పీ ఇక్కడ స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు, పెండింగ్ కేసుల పురోగతి తదితర అంశాల గురించి జీఆర్పీ ఎస్ఐ జి. వెంకటాద్రి డీఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా తెనాలి రావడం జరిగిందని రికార్డుల అప్‌డేట్, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. రైల్వేస్టేషన్ల పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్లాట్‌ఫాంల మీద కూడా బీట్ పెంచి నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ వివరించారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసేవలో ప్రభుత్వ ఉద్యోగులు కీలకం



సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించిన సాయిమాధవ్

తెనాలి: ప్రజాసేవలో ప్రభుత్వ ఉద్యోగులు కీలకమని, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, ప్రకటించే పథకాలనూ అమలుచేసేది వారేనని ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అన్నారు. అవినీతి జోలికి పోకుండా కేవలం జీతంతోనే బాధ్యతలను నిర్వర్తించిన ఉద్యోగులను అభినందించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సచివాలయంలో ట్రెజర్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో ఏటీఓగా ఉద్యోగ విరమణ చేసిన వల్లూరు సుబ్రహ్మణ్యం ఆత్మీయ అభినందన సభను సోమవారం నిర్వహించారు. తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక వీజీకే భవన్లో ఏర్పాటైన సభకు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ సాయిమాధవ్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ జీవితానుభవాలను గ్రంథస్తం చేస్తే స్ఫూర్తిదాయకం కాగలవని సూచించారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తెనాలి యూనిట్ కార్యదర్శి బేతాళ కృష్ణమోహన్ మాట్లాడుతూ, యూనియన్ సమావేశాల్లో తాను సుబ్రహ్మణ్యంతో వేదికను పంచుకున్నట్టు గుర్తుచేసుకున్నారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు స్వాగతం పలికిన సభలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కన్నెగంటి గోపీచంద్, తాడిబోయిన హరిప్రసాద్, సినీనటుడు వేమూరి విజయభాస్కర్, శ్రీనివాసరావు మాట్లాడారు. సభలో సుబ్రహ్మణ్యం దంపతులను ఘనంగా సత్కరించారు.

'డొంక' వేధింపులపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు



సబ్ కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న నాగేశ్వరరావు

తెనాలి: రూరల్ మండల గ్రామం గుడివాడలో డొంక భూములను సాగుచేసుకుంటున్న దళితుల పొలాల్లో పంటకాల్వను తవ్విన అరాచకంపై బాధితుల్లో ఒకరైన రుద్రపాటి నాగేశ్వరరావు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీని దాఖలు చేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని సబ్ కలెక్టర్ వి.సంజనా సింహకు వివరించారు. గుడివాడ గ్రామ సర్పంచ్ గత ఎన్నికల్లో ఓటు వేయలేదన్న కక్షతో కావాలని తమ పొలాన్ని ధ్వంసం చేసినట్టు ఆరోపించారు. తమ భూమిని పూర్వం ఉన్నట్టుగా చదును చేసి అప్పగించేలా చూడాలనీ, గ్రామసర్పంచ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదుకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. తన తండ్రి దావీదు ప్రభుత్వ భూమి సర్వే నెం.337లో 40 సెంట్ల పొలాన్ని ఎప్పట్నుంచో సాగుచేస్తున్నారని, 1974లో అప్పటి తహసీల్దారు తన తండ్రికి ఆర్‌సీ నెం.72/74 సాగుపట్టాను ఇచ్చినట్టు తెలిపారు. మొత్తంమీద ఇప్పటికి 90 ఏళ్లగా తమ కుటుంబ సభ్యుల స్వాధీనంలోనే ఉందన్నారు. డొంకరోడ్డు వెడల్పు పేరుతో పంటపొలంలోకి వెళ్లేందుకు వీలులేని విధంగా తవ్వేశారని చెప్పారు. వాస్తవగా అక్కడున్న డొంక (బండ్లబాట) 20 అడుగుల వెడల్పులో ఉందని, రెండు ట్రాక్టర్లు ఎదురెదురు వచ్చినా ఇబ్బంది లేదన్నారు. దళితుల మన్న వివక్షతతోనే జీవనోపాధిగా ఉన్న పొలాన్ని ధ్వంసం చేశారనీ, కాళ్లమీద పడి బతికిలాడినా వినలేదన్నారు. గ్రామంలో తన ఇంటిముందు రోడ్డు పక్కన చిన్న పశువులపాకను కూడా తీయమని పంచాయతీ కార్యదర్శిచే నోటీసు ఇప్పించారని, పోలీసులను తీసుకొచ్చి బెదిరిస్తున్నాడని ఆరోపించారు.

మొత్తం ఏడు అర్జీలు...

ఇదిలావుంటే సోమవారం సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ నిర్వహించిన పీజీఆర్ఎస్ సమావేశానికి మొత్తం ఏడు అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ పరిధిలోనివి రెండు కాగా, మున్సిపాలిటీ, పోలీస్, డీఎల్‌పీఓ, హౌసింగ్, ఎంపీడీఓ పరిధిలోనివి ఒక్కొక్కటి ఉన్నాయి. సంబంధిత అధికారులకు పంపి నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషిచేస్తామని సబ్‌కలెక్టర్ వెల్లడించారు.

అదానీని అరెస్టు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

తాడికొండ: సోలార్ విద్యుత్తు కొనుగోలులో.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పారిశ్రామికవేత్త అదానీని అరెస్టు చేయాలని సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం డిమాండ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ రావు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. అధిక ధరలు, నిరుద్యోగ సమస్య నానాటికి పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో శాంతిని నెలకొలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ నాయకులు బండి సాంబయ్య, రేపూడి శ్రీనివాసరావు, కుర్ర అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సీపీఐ నిరసన

తాడేపల్లిరూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన డిమాండ్స్ డే ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ అదానీ కంపెనీ గ్రూపులపై జరిగిన అవినీతిపై కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంట్ కమిటీ వేయాలని, మణిపూర్‌లో జరుగుతున్న అమానుష దాడులు, సంఘటనలపై పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచుకుంటూ పోతున్నారని, లక్షల కోట్ల అవినీతి చేసిన అదానీని ప్రశ్నించలేని కూటమి ప్రభుత్వం మోడీని చూసి భయపడుతోందని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ఆక్రమణలు తొలగించండి

తెనాలిఅర్బన్: 28వ వార్డులో రోడ్డు పక్కన్న ఉన్న మున్సిపల్ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని, వాటిని తొలగించాలని ఆ వార్డుకు చెందిన షేక్ గౌస్ మెహిద్దీన్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన కమిషనర్ బండి శేషన్నను కలిసి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ఆర్ఓ రాంప్రసాద్, మేనేజర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు.

కారులో వింత శబ్దాలు ఓ భ్రమ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కత్తుల పేటలో క్రిస్టియన్ శ్మశాన వాటిక వద్ద తగలబడిన కారుపై గ్రీన్ పట్టాను కప్పి ఉంచారు. రాత్రి సమయంలో ఆ కారులో నుంచి వింత శబ్దాలు వస్తున్నాయంటూ కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా ఆ కారు పూర్తిగా దగ్ధమై ఉంది. నెంబరు ప్లేట్లు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు కారు ఇక్కడ వదిలి తగలబెట్టి ఉంటారని అనుమానించారు. ఇదిలా ఉండగా అక్కడే మదర్ థెరిస్సా కాలనీలో నివసించే ఓ వ్యక్తి కారు తనదేనని, శ్మశాన వాటిక వద్దకు రాగానే షార్ట్ సర్క్యూట్ కారణంగా కారు దగ్ధం కావడంతో ఇన్సూరెన్స్ క్లెయిమ్ నిమిత్తం ఇక్కడ పార్క్ చేశానని తెలిపారు. వింత శబ్దాలు అనేది కొంతమంది భ్రమ మాత్రమేనని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని సీఐ కల్యాణ్ రాజు అన్నారు.

ద్విచక్ర వాహనం స్వాధీనం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో గత పది రోజుల నుంచి పోలకంపాడులో పాత పెట్రోల్ బంకు వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పాత పెట్రోల్ బంకులో ఏపీ 39 హెచ్‌డీ 0858 నంబరు గల రెడ్ కలర్ పల్సర్ వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారని లారీ యజమానులు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు చూపించి ఈ వాహనాన్ని తీసుకువెళ్లవచ్చని ఎస్ఐ కోటయ్య తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



మురుగు కాల్వను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, దానిలో భాగంగా పలు రోడ్లను విస్తరిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పాత రత్న టాకీసు వైపు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ శివాజీచౌక్ నుంచి నాయుడు కుండ బిర్యానీ పాయింట్ వరకు 125 మీటర్లు రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. దీనికోసం రూ.25.50లక్షల నిధులను వెచ్చిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తోట రఘురామ్, కో-ఆప్షన్ సభ్యుడు పెద్బింగ్ సుభానీ, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, టీపీఓ సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు తాడిబోయిన రమేష్, కాంట్రాక్టర్ గోపాలం శివశరత్ బాబు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి..

తెనాలిఅర్బన్: అధికారులు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని, ఆ దిశగా అందరు ప్రయత్నించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 26వ వార్డులో సోమవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వాహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండటాన్ని గమనించిన ఆమె వెంటనే వాటిని బాగు చేయించాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ షేక్ ఇస్మాయేల్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న తాడికొండ సీఐ కె.వాసు

మోతడక(తాడికొండ): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ కె.వాసు పేర్కొన్నారు. సోమవారం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనర్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆన్‌లైన్ కొనుగోళ్లు, నగదు లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ సీక్రెట్ పిన్‌కోడ్ నంబర్లు, ఓటీపీ ఎవరికీ షేర్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. చాలా మందికి అవగాహన లోపం ద్వారానే సైబర్ నేరాలు జరుగుతున్నాయని, అందుకోసమే వాటిపై అవగాహన పెంపొందించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విడియోను ప్రదర్శించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట ఎలా వేయాలి అనే విషయాన్ని వివరించారు. విద్యార్థులు కూడా వీలైనంత వరకు తమ కుటుంబ సభ్యులు, సమాజంలోని ఇతర వ్యక్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి చైతన్యవంతుల్ని చేయాలని సూచించారు. ఈ ప్రిన్సిపాల్ కె.నాగశ్రీనివాసరావు, వివిధ శాఖాధిపతులు డాక్టర్ బి.తులసీరాణి, డి.శంకరరావు, నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన శ్రీ ఉమా మహేశ్వర కళాక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాట్యాచార్య కంచికట్టు వాసుదేవరావు పర్యవేక్షణలో బిందు యోషిత, హర్షిణి, సుప్రియరెడ్డి, చైత్రిక, గీతిక, హర్షిణిలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు. వాసుదేవరావుతో పాటు చిన్నారులకు ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించి అభినందించారు.

బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



మందడం(తాడికొండ): బాల్య వివాహాలు బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కమ్యూనిటీ ఆర్గనైజర్ అత్తోట పోతురాజు అన్నారు. పిల్లల భద్రత- పెద్దల బాధ్యత అనే అంశంపై గుడ్ షెపర్డ్ సిస్టర్స్ సేవా సంస్థకు చెందిన చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తుళ్లూరు మండలం మందడం గ్రామంలో నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలికలను చిన్న చూపు చూడటం, వారికి తగిన వయస్సు రాకముందే పెళ్లి చేయడం, బాలికా హింస ఎక్కడైనా జరిగితే వెంటనే 1098, 100 నంబర్‌లకు ఫోన్ చేసి, సమాచారం అందిస్తే తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కిషోర బాలికలు ఎదుర్కొంటున్న రక్తహీనత సమస్య నివారణ, వ్యక్తిగ పరిశుభ్రత, ఐరన్ మాత్రల వినియోగంతో కలిగే ప్రయోజనాలను అంగన్‌వాడీ టీచర్ వెంకటేశ్వరమ్మ వివరించారు. ఆశా వర్కర్ బేబి, గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిబ్బంది పాల్గొన్నారు.